# మధుర స్మృతి ★

రచన: బి. శంకరయ్య

"ఎప్పుడో ఏదో అనుభవింపగలనని అఱ్ఱులు చాచుకొని కాలంతోపాటు బుఱ్ఱ పాడు చేసికొనేకంటే, కాలప్రవాహంలో కలిసిపోయిన మధురానుభూతుల్ని మననానికి తెచ్చుకొని, నెమరువేసికొనేది నీతివంతము, ఆరోగ్యకర" మని నా ఉవాచ. ఎవరేమిచేసినా, ఏదేమైనా నావరకు నేను నా జీవితయాత్రలోని మైలు రాళ్లను మరువలేను, మరువనుకూడా. అది నా ఆశయాలపై ఆటంబాంబులవర్షము. ఈ స్పూట్నిక్ యుగంలో ఉజ్వల భవిష్యత్తు నాశించే మానవుడు విశ్వకర్మగా నుండాలి. అది అందరికీ సాధ్యంకాదు.

ఇప్పటికీ నా బుఱ్ఱలో తారాడుతూనే యున్నాయ్. ఆనాటి నవ్య మధుర సంపత్తిని అందుమూలంగా పొందిన దివ్యానుభూతిని జ్ఞప్తికి తెచ్చుకోకుండా వుండలేకపోతున్నాను. ఆ తియ్యనిబాధను మరచి కృతఘ్నుడుగా తయారుకాలేకపోతున్నాను. బాగా గుర్తుంది. నా జీవిత ప్రయాణంలో తొలి మైలురాయి దాటకమున్నే అలసట దీర్చుకోవాలని ఆనాడు గలిగిన ఆ కాంక్ష. అప్పటికి షోడశవర్షము కూడా చూడలేదు. ఆ వుటలోనే నాలో అననాన్ని యేర్పరచుకొంది ఆకాంక్ష. దాని ఫలితము నా మొదటి ప్రయత్నం. నా ప్రయత్నానికి పట్టుగొమ్మ విరిచీ విరియని విరిబోడి. నాకంటె లేతవయస్సుది. కాని, దిట్టమైన ఎద గలది. చలించని చంచలాక్షి. కలతపొరని నిష్కళంక బెదురు తెలియని లేడిపిల్ల. తారసిల్లిందొకనాడు నా నయనతారలకు, విందు చేసికొన్నాను నా దీక్షావీక్షణాలతో. అప్పుడే ఏదో అవ్యక్తపుటానందాన్ని అనుభవించాను. ఆనాడే నాలో ఆశ అంకురించింది. ఆకాంక్ష యెక్కువైంది. తీవ్రత నన్ను మాడ్చివేసింది. ఆ తీయటిబాధకు తాళలేకపోయాను. కాని ముందుసాగేందుకు చాల వెనుకబడియున్నా. అక్షరాభ్యాసం కాకముందే కావ్యాలకు వ్యాఖ్యానము చేయాలన్నట్లయింది నాతీరు. ప్రారంభించేందుకు తెలియకనే అంత్యాన్ని చూడాలనుకొన్నట్లయింది నా అగచాట్లు. శత్రువులతో తలపడకనే గాలితో కుస్తీలుపట్టినట్లయింది నా ముందంజ. ఆ గ్రంథంలో మొదటి పుటలోని ప్రథమాక్షరమేదో తెలిసికోలేక తంటాలుపడ్డాను. అంతుతెలియని అవస్థతో సతమతమయ్యాను. కాని సిగ్గుతెలియని అం కాదు నా సింగారి చిలిపిచూపులు నాలోని కోర్కెలకు బలం చేకూర్చినాయి. నాపై ప్రసరింపజేసే తిన్నని వీక్షణాలు నాలోని భీరుత్వాన్ని పారద్రోలాయ్. తరచూ నా నేత్రాలకు విందుగొల్పే ఆ తరళాక్షి దర్శనం నాలో విశేషించిన శంకను తొలిగించింది. కలవరం జూపని ఆ కన్నులు నన్ను కార్యరంగంలోనికి ప్రవేశింపజేసాయి.

నా జ్ఞాపకశక్తి సరియైనదే ననుకొంటా. అది వసంతకాలం, హృదయవికాసయోగం, కవుల కలాలకు కలవరాన్ని గల్గించే కమనీయ భాగ్యం. ఆకలిగొన్న అనువులకు అమృతాన్ని చిలికే అమరభోగం. నాలో ఆశను రేకెత్తించిన ఆనంద దివసం. ఆనాడే....ఆ సాయం సమయమే వరిపొలాలవైపు వెళ్లాలనుకొన్నా. ఒంటరిగా వెళ్లేందుకు మనసు ఎదురుతిరిగింది. వెదుకబోయిన తీగ ఎదురైనట్లు తారసిల్లింది నా హృదయకమలం. "అందులోని పరిమళాన్ని ఆఘ్రాణించేందుకు అనుమతించవూ?" అని వేడుకొన్నా. అనుగమిస్తానని ఆశ నిచ్చింది నా వాణి. అప్పటికి వరిపంటల పూడ్పు ముగిసింది. గడ్డివాములు పొలాల్లోనే వున్నాయి. నేను ముందు, కనుచూపుమేరలో నన్ననుసరించేనారాణి బయలుదేరాం బ్రతుకు బాటలను వెదుక్కొంటూ. బెదురుబెదురుగా పశువులు పచ్చిగడ్డిని విందారగిస్తున్నాయి. ఒక గడ్డివాము మఱుగున విశ్రమించా. విరికన్నె వెదుక్కుంటూ నా ప్రక్క ప్రక్కజేరుకొంది. వరికోసినమొక్కల తీయటి తాల్మి గుబాళిస్తున్నది. ఎండినగడ్డి వాసనలు ఎదకెంతో మత్తెక్కిస్తున్నాయ్. పిచ్చుకలు రాలినగింజల నేరికొనితింటూ కలకల నాదం చేస్తున్నాయ్. సూర్యభగవానుడు తన తీక్షణ కిరణాలకు విశ్రాంతి నిస్తున్నాడు. ప్రకృతి మాత మమ్ముల నాశీర్వదిస్తున్నట్లయింది.

వన్నెలకన్నె నావంతజేరింది. కాని, కలవరంచెందలేదు, కలత నొందలేదు. పైపెచ్చు నిశ్చలమైన మనస్సుతో గాంభీర్యముద్ర వహించింది. తరచు నా వాలుచూపులు ఆమె ముఖారవిందాన్ని రుచిచూస్తున్నాయ్. అందుకామె అభ్యంతరం చెప్పలా. అయిష్టత చూపలా. అప్పుడు గ్రహించాను. ఇద్దరం ప్రేమించుకొన్నామని. మా యిద్దరికీ ఒకే భావన గలిగింది. అందుకు ఫలితం క్షేత్రజీవి తాన్నెరుగని నా మనోరంజనికి మొదటిసారిగా పొలంపనిమీద మమతగలిగి నాతో వచ్చి నా ప్రక్కజేరింది.

చల్లటి పిల్లగాలులు ఝుయ్‌మని వీవసాగినయ్. మా శరీరాలు పులకరించాయ్. నా రాణి నాదగ్గరకు జరిగింది. ఆమె కోమల శరీరం నన్ను ముద్దిడుకొంది. వెచ్చగానుండిందా స్పర్శ. నేనూ మరింతదగ్గరగా జరిగాను. మా యిద్దరి శరీరాలు ఒకటి అయినాయ్. వెచ్చని ఆనందాన్ని అనుభవిస్తున్నాం. ఆమెలోని వేడి నాలో ప్రవహించిందేమో! నా నుదురు తీవ్రంగా కాలిపోతుంది. ఎద తీక్షణంగా కొట్టుకొంటున్నది. గొంతు తడి ఆరిపోయింది. పెదవులు ఎండిపోయినాయ్. నా చూపులు చలించి వాలిపోతున్నాయ్. నాపైని నా అధికారాన్ని కోల్పోతున్నా. అవయవాలు ఎదురు తిరుగుతున్నాయ్. చేతులు నాకు జవాబు చెప్పలా. అవి ఆమె శరీరాన్ని వెదుక్కొంటూ ప్రయాణించేస్తున్నాయ్. చిలిపిచిలిపిగా చిందులు త్రొక్కుతున్నాయి నా చేతి వ్రేళ్లు. రాణి తనమెడతో నా భుజాన్ని పెనవేసుకొంది. ఒక్కతూరి నెమరు వేసికొంటే అప్పటితీరు యిప్పటికీ చూడగలుగుతున్నా. నా తల గిఱ్ఱున తిరిగిపోయింది. అంతవరకు నేను జూపే తీవ్రమైన కాంక్ష నన్నగిలుతూ వుంది. అయిష్టత నాలో అడుగడుక్కి పైకి వస్తూనే యుండింది, కాని నా నెచ్చెలివీక్షణాలు నాలోని భయాన్ని పారద్రోలాయ్. ఆలస్యాన్ని అంతంజేసింది ఆమెజూపిన ఆవేదన. పిచ్చుకజంటలు మాముందు ఉల్లాసంగా ఒకదానిపై నొకటి పడుతూ కేరింతలు కొడుతున్నాయ్. మా సమీపంలోనే గడ్డిమేస్తున్న కోడెదూడ రంకెవేసింది.

కొన్ని గడియలతర్వాత చివాలున లేచాను. మతి చలించినట్లయింది. ఏదో పెద్ద తప్పిదం చేసినట్లయింది. పరుగెత్తాలనుకొన్నా. కానీ, పరుగెత్తలేకపోయాను. ప్రపంచవిజేత ననుకొని ఒకప్రక్క గర్వపడుతూవున్నా. రెండవ మైలులో పడ్డానని తెలిసికొన్నా కాని, చిరాకెక్కువైంది.

ఇప్పటికీ ఆ మధురదృశ్యాలు నా నేత్రాల ముందు నాట్యంచేస్తూనేవున్నయ్. బాల్యంలో యౌవనాన్ని రుచిచూచాను. జీవితంలో క్రొత్తపుటలను ప్రారంభించాను. నేనూ ఎద ఎదిగిన మానవుణ్ణయ్యానని గర్విస్తూ ఇంటిదారి పట్టాను.

అర్థశతాబ్దం అల్లరి చేయకుండా దొర్లిపోయింది ఆనాటి సాయంకాలంనుండి. కాని నాటి నా ఆనందాన్ని మరువలేదు. బాలుడుగా ఆనాడు అనుభవించిన అనుభూతులు ప్రప్రథమంగా ఆవురొమ్ములు పట్టుకొని పాలుగుడిచిన దినం జ్ఞాపకానికొస్తుంది.

★